

అకాల వర్షం.. తడిసిన ధాన్యం



డోర్నకల్ మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో బస్తాలపై కప్పిన టార్పాలిన్‌పై వర్షపునీరు ఆగిపోవడంతో బకెట్లతో తోడుతున్న రైతులు

- పలు కొనుగోలు కేంద్రాల్లో కాంటాలై ఉన్న వడ్లు
- లారీలు రాక, ఎగుమతులు కాక నిలిచిన బస్తాలు
- మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వాన
- జిల్లాలో 156.2 మి.మీ. వర్షపాతం నమోదు

మహబూబాబాద్ అగ్రికల్చర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో వానలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి అడపదడపా చిన్నపాటి జల్లులు కురుస్తున్నాయి. అకాల వర్షంతో పలు మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాలు తడవడంతో, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నానిన వడ్లను ఎలా ఆరబెట్టుకోవాలో తెలియక నానా తంటాలు పడుతున్నారు.

కాగా, బస్తాలపై టార్పాలిన్‌లు కప్పుకున్నప్పటికి తడిసిపోయాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీలు రాక, కాంటాలు అయి 10 నుంచి 15 రోజుల వరకు బస్తాలు ఎగుమతి కాకుండా నిలిచిపోతున్నట్లు ఆయా మండలాల రైతులు చెబుతున్నారు. లారీలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సక్రమంగా తీసుకువచ్చి, ఎగుమతి చేయాల్సిన జిల్లా పౌర సరఫరాల అధికారులు, ఇతర శాఖల అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు.

జిల్లాలో ఇలా..

చిన్నగూడూరు మండలంలో వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో గత 15 రోజుల క్రితం బస్తాలు కాంటాలు అయి ఎగుమతి కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ అకాల వర్షంతో పరదాల కింద ఉన్న ధాన్యం, బస్తాల కిందిభాగంలోనూ తడిసిపోయింది. బస్తాల అడుగుభాగంలో తడిపదును ఏర్పడడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విస్సంపల్లి, జయ్యారంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. డోర్నకల్ మండలంలో కూడ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీలు రాక కాంటాలు అయిన ధాన్యం బస్తాలు నిల్వ ఉండిపోయాయి. పైన టార్పాలిన్‌లు కప్పినప్పటికి కిందిభాగంలో తడిసిపోయాయి. రైతులు ధాన్యం బస్తాలు తరలించాలని అధికారులను వేడుకుంటున్నా.. లారీలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే లారీలు తెప్పించి బస్తాల ఎగుమతి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

దంతాలపల్లిలో కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలపై టార్పాలిన్‌లు కప్పినప్పటికి కిందిభాగంలో

మిగతా 8వ పేజీలో...



కల్లాలలో తడిసిన ధాన్యం బస్తాలు



చిన్నగూడూరు కొనుగోలు కేంద్రంలో కాంటాలు అయి బస్తాలు ఎగుమతి కాకపోవడంతో తడిచిన నిల్వఉంచిన బస్తాలను చూపుతున్న రైతులు

జిల్లాలో వర్షపాతం ఇలా..

జిల్లాలో మంగళవారం రాత్రినుంచి బుధవారం ఉదయం 8.30 గంటల వరకు 156.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సగటున 9.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కొత్తగూడలో 9.6మిల్లీమీటర్లు, గంగారంలో 1.0, బయ్యారంలో 8.6, గార్లలో 3.0, డోర్నకల్‌లో 8.4, కురవిలో 7.4, మహబూబాబాద్‌లో 6.2, గూడూరులో 8.0, కేసముద్రంలో 11.4, నెల్లికుదురులో 18.6, నర్సింహులపేటలో 19.8, చిన్నగూడూరులో 9.4, మరిపెడలో 15.2, దంతాలపల్లిలో 11.8, తొర్రూరులో 13.2, పెద్దవంగరలో 4.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

విద్యార్థులు లక్ష్యంతో చదువాలి

- పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క
- గాంధీనగర్‌లోని గిరిజన గురుకులంలో నిద్ర



గాంధీనగర్‌లో విద్యార్థినులతో మాట్లాడుతున్న సీతక్క

కొత్తగూడ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదువాలని, నాణ్యమైన భోజనం అందించాలనే ప్రభుత్వం మెస్‌చార్జీలు పెంచిందని పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క సూచించారు. గాంధీనగర్‌లోని గిరిజన సంక్షేమశాఖ బాలిక గురుకుల విద్యాలయంను పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క బుధవారం రాత్రి పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడారు. ఆర్థిక భారంతో, ఇతర కారణాలతో చదువును మధ్యలో ఆపవద్దని సూచించారు. చిన్నతనంలో తాను చదువుకోక, అడవుల బాట పట్టానని, నేడు నిత్య విద్యార్థినిగా ఉంటూ.. చదువుకుని డిగ్రీలు సాధించానని వివరించారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను క్రమశిక్షణతో విని.. ప్రణాళిక ప్రకారం చదివి, ఉత్తీర్ణత సాధించాలన్నారు. కాగా, మంత్రి గురుకులంలోనే విద్యార్థినులతో నిద్రించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పన, ఉపాధ్యాయులు శ్రీలత, మీనా, శాంత, రమణీ, జ్యోతి, శోభన్, సారంగపాణి, ఏఎన్ఎం సరస్వతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రధానిగా వాజ్‌పేయి దేశానికి సేవలు

- మాజీ ఎంపీ, ప్రొఫెసర్ సీతారాంనాయక్



మానుకోటలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న సీతారాంనాయక్, నాయకులు

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రధానిగా వాజ్‌పేయి భారత దేశానికి సేవలందించారని మాజీ ఎంపీ, ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్ కొనియాడారు. దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయి శతజయంతి వేడుకలను బుధవారం మహబూబాబాద్ జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి ఆయన పూలమాలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన వాజ్‌పేయి అనేకసార్లు ఎంపీగా గెలిచారని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉండికూడా దేశవ్యాప్తంగా ఆయన మన్ననలు పొందారని చెప్పారు. ఉత్తర తెలంగాణకు ప్రధాని నరేంద్ర మోదీ వరాల జల్లు కురిపించారని పేర్కొన్నారు. 55 ఏళ్ల

మిగతా 8వ పేజీలో...

- 'రోగ' ఘంటికలు!

బీపీ.. షుగర్.. భయపెడుతున్నయ్



శారీరక శ్రమ లేక వ్యాధుల బారిన జనం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

పెరుగుతున్న పని ఒత్తిళ్లు.. కరువవుతున్న మానసిక ప్రశాంతత.. మారుతున్న జీవన శైలి.. ఆహారపు అలవాట్ల నేపథ్యంలో ఓరుగల్లు ప్రజలు రక్తపోటు, మధుమేహం బారిన పడుతున్నారు. ప్రస్తుత ఉరుకుల, పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకపోతుండటంతో అనారోగ్యం పాలవుతున్నారు. వృత్తిలో ఒత్తిడి, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో అతాలకుతలమవుతున్నారు. ఈ సమస్యల వలయం నుంచి బయట పడే క్రమంలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ వాకింగ్, వ్యాయామం, యోగా లాంటి వాటికి ఓ గంట సమయం కేటాయించే తీరిక లేకుండా పోతోంది. పైగా ఇంట్లో తిండి తినే సమయం లేక బయటి ఆహారాలు, జంక్ ఫుడ్‌లకు అలవాటు పడి బీపీ, షుగర్లతో సహవాసం చేస్తున్నారు. వీటికి తోడు మద్యం, పొగాకు ఉత్పత్తులు, డ్రగ్స్ తదితర వాటికి అలవాటు పడి నరకం అనుభవిస్తున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సర్వే జరుగుతుండగా అందులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. 30ఏళ్ల దాటని వారిలో అధిక శాతం మంది రక్తపోటు, మధుమేహం బారిన పడుతున్నట్టు గణాంచాలు చెబుతున్నాయి.

యువతలో మరింత టెన్షన్

జీవన శైలి జబ్బులైన రక్తపోటు, మధుమేహం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా చాప కింద నీరులా వ్యాపిస్తున్నాయి. ఇంతకుముందు పట్టణాల్లోనే ఎక్కువగా కనిపించే ఈ జబ్బులు పల్లెల్లోనూ వ్యాపిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న వరంగల్‌లాంటి నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఇవి రంకెలేస్తున్నాయి. గత జనవరి 1వ తేదీ నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 30ఏళ్ల పైబడిన వారిలో రక్తపోటు, మధుమేహ వ్యాధులపై ప్రత్యేకంగా సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేలో పలు విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పట్టణాల్లోనే కాకుండా పల్లెల్లో కూడా ఈ బీపీ, షుగర్లు ప్రజలను ఆగం చేస్తున్నాయి. వృద్ధులే కాకుండా యువత సైతం ఈ రెండు జీవనశైలి వ్యాధులతో కుస్తీ పడుతున్నారు. అయితే అవగాహన లేక కొందరు, నిర్లక్ష్యంతో ఇంకొందరు ఈ రెండు ప్రమాదకర జబ్బులను నియంత్రణలో ఉంచుకోలేక గుండె జబ్బులకు గురవుతున్నారని వైద్య నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. వరంగల్, హనుమకొండ నగరాల్లో అత్యధికంగా బీపీ, షుగర్లు ప్రజలను ఎటాక్ చేస్తున్నాయి. 30ఏళ్ల నుంచి 55ఏళ్ల వయస్సు వారిలో అధికంగా బీపీ, షుగరు వ్యాధులను గుర్తిస్తున్నారు. జీవన శైలిలో వచ్చిన మార్పులే కారణమని వైద్యులు పేర్కొంటున్నారు.



- ఉమ్మడి వరంగల్ జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు
- 30ఏళ్లు నిండిన వారిలో 65.5శాతం మందికి తలెత్తుతున్న సమస్యలు
- మహిళలకంటే పురుషుల్లోనే అధికంగా రక్తపోటు, మధుమేహం
- వ్యాయామం, యోగాతో చెక్ పెట్టవచ్చంటున్న వైద్య నిపుణులు
- పల్లె, పట్నం తేడా లేకుండా మారుతున్న జీవన, ఆహార శైలి
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సర్కార్ సర్వే

ఉమ్మడి జిల్లాలో ఈనెల 20వ తేదీ వరకు నమోదైన బాధితులు ఇలా..

జిల్లా	బీపీ కేసులు	షుగర్ కేసులు
వరంగల్	75,850	38,726
హనుమకొండ	60,042	29,941
మహబూబాబాద్	56580	27,499
జనగామ	44,652	18,578
భూపాలపల్లి	14,051	5,500
ములుగు	17,426	7,290

65.50శాతం మందిలో దీర్ఘకాలిక సమస్యలు

ఒత్తిడి కారణంగా వచ్చే ఈ వ్యాధులను నియంత్రించేందుకు చాలా మంది దృష్టి పెట్టడం లేదు. దీంతో 30ఏళ్ల నిండిన ప్రతీ ఐదుగురిలో ముగ్గురు రక్తపోటుతో బాధపడుతున్నారు. ఉదాహరణకు వరంగల్ జిల్లాలో 30ఏళ్లకు పైబడిన వారు 5,13,992 మంది ఉండగా.. వీరిలో 1,74,313మందికి రక్తపోటు, మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వీరిలో 75,850మందికి రక్తపోటు, 38,726మందికి మధుమేహం ఉన్నట్టు గుర్తించారు. పరీక్షలు నిర్వహించిన 1,74,313మందిలో 1,14,576మందికి బీపీ లేదా షుగర్ వ్యాధులున్నాయి. అంటే 65.5శాతం ప్రజలు వాటి పడినట్టు గుర్తించారు. 30ఏళ్లపైబడిన వారిలో కేవలం 34.5శాతం మంది మాత్రమే బీపీ, షుగర్ల బారిన పడకుండా జీవనాన్ని గడుపుతున్నారు. వీరిలో చాలా మంది శారీరక శ్రమ లేదా వ్యాయామకంతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నావారే ఉన్నట్లుగా గుర్తించారు. కాగా, మహిళలకంటే పురుషలే అధికంగా ఈ వ్యాధుల బారిన పడుతున్నారు. వరంగల్ జిల్లాలో రక్తపోటు కేసులు 75,850 గుర్తిస్తే, ఇందులో 39,898 మంది పురుషులు

మిగతా 7వ పేజీలో...




ఒత్తిడి వల్లే అసలు సమస్యలు..

డాక్టర్ పాశం నాగరాజు, ఫిజీషియన్, ఎంజీఎం ఆస్పత్రి వరంగల్

మధుమేహం, రక్తపోటు.. రెండూ స్నేహితుల లాంటివి. ఒకటి వచ్చాక మరొకటి కొన్ని సంవత్సరాల తర్వాత వచ్చే అవకాశాలున్నాయి. ప్రధానంగా ఒత్తిడిని తగ్గించేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం, ఆహార నియమాలు పాటించటం వల్ల బీపీని కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు. తక్కువ కార్బొహైడ్రేట్, ఎక్కువ ఫైబర్, మాధ్యమికంగా ప్రొటీన్ కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల షుగర్‌ను నియంత్రించవచ్చు. ఏ రకమైన ఒత్తిడి లేకుండా, క్రమం తప్పకుండా వ్యాయామంతో బీపీ, మధుమేహాన్ని నియంత్రించవచ్చు.

వ్యాయామం లేకనే జీవన శైలి జబ్బులు

డాక్టర్ మల్లికార్జున్, డీఎంహెచ్‌వో, జనగామ



ఒత్తిడి కారణంగానే బీపీ, మధుమేహం వస్తున్నాయి. వ్యాయామం చేయటం లేదు.. సరైనా ఆహారం తీసుకోవడం లేదు. కనీసం నిత్యం 6 నుంచి 8గంటల వరకు కండినిండా నిద్రపోవాలి. ఆకుకూరలు, కూరగాయలతో భోజనం తప్పనిసరి. ప్రతీ రెండు నెలలకు ఒకసారి షుగర్ టెస్టులు చేయించుకోవాలి. ప్రభుత్వం బీపీ, షుగర్ బాధితులకు ఉచితంగా మందులు, టెస్టులు నిర్వహిస్తుంది. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- చర్చిలలో అర్ధరాత్రి కేక్‌ల కటింగ్ • అలరించిన సాంస్కృతిక నృత్యాలు • వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్



మహబూబాబాద్ ఎల్‌బీజీ నగర్ కాలనీ జేసీజీఎం చర్చి క్రిస్మస్ వేడుకలో కేక్‌కట్ చేస్తున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్



మానుకోట బ్లెస్ట్ చర్చిలో క్రిస్మస్‌తాత వేశధారణలో నృత్యం చేస్తున్న దృశ్యం



మహబూబాబాద్ బ్లెస్ట్ చర్చిలో కొవ్వొత్తులు వెలిగించి, ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ పర్వదినం సందర్భంగా ముస్తాబైన చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలు దాటాక క్రిస్మస్ కేక్‌లను కట్‌చేసి, వేడుకలను ఆరంభించారు. ప్రార్థన మందిరాల్లో ప్రత్యేకంగా క్రీస్తు జనన చరిత్రను తెలిపే విధంగా అందమైన పశువుల పాకలను ఎండుగడ్డితో చేసి, రంగురగుల వస్తువులతో అలంకరించి అందులో బాల ఏసు ప్రతిమలను ఏర్పాటు చేశారు. క్రైస్తవులు భారీగా చర్చిలకు చేరుకొని పాస్టర్ల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

క్రైస్తవులు తమ ఇళ్ల పైభాగంలో క్రిస్మస్ స్టార్లను ఏర్పాటు చేసుకున్నారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రజలంత సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయా చర్చిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

మానుకోట పట్టణంలో..

- మానుకోట పట్టణంలోని ఎల్‌బీజీ నగర్ కాలనీలో జేసీజీఎం చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో స్థానిక శాసన సభ్యుడు భూక్య మురళీనాయక్ పాల్గొని, కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా వివిధ పర్వదినాలు జరుపుకుంటూ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక భారతదేశ సంస్కృతిక, సంప్రదాయాలని పేర్కొన్నారు. అనంతరం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పాస్టర్ తిమోతి, వార్డు కౌన్సిలర్లు సూర్నపు సోమయ్య, భూక్య పద్మసీతారాం, పోతురాజు, నాయకులు రావుల రాజు, బడుగుల లక్ష్మణ్ పాల్గొన్నారు.
- మహబూబాబాద్ పట్టణం నర్సంపేట బైపాస్‌లోని ఏసుశక్తి సహవాసదైవక్షేత్రంలో పాస్టర్ లివింగ్‌వాటర్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి, వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిభారాణి, విజయ్, ఉమారాణి, సుధాకర్, దేవరాజ్, ప్రసాద్, భాస్కర్, జగదీష్, కవిత, కృపావరం పాల్గొన్నారు.
- గుమ్మనూర్ శివారులోని బిలీవర్స్ చర్చిలో ఫాదర్ ప్రేమానందం, స్టెలామేరీ దంపతులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తు బోధనలు భక్తులకు ప్రబోధించారు. కొవ్వొత్తులు వెలిగించి చీకటిని పారదోలి వెలుగు నింపాలని సందేశాన్ని పాస్టర్ ప్రేమానందం వివరించారు. యువతుల కోలాట నృత్యాలు ఉత్తేజపరిచాయి. మతపెద్దలు ప్రసాద్, స్వామినాథ్, ప్రభాకర్, రవి, సునిల్ పాల్గొన్నారు.
- మహబూబాబాద్ సీఎస్ఐ చర్చిలో రెవరెండ్ ప్రతాప్ ఆధ్వర్యంలో తెల్లవారు జామున క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ వేడుకలో గులగట్టు సంతోష్, దామల్ల రవికుమార్, రోజానీలా, జెన్ని సెల్విన్ పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా..

మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని పలుచర్చిల్లో పాస్టర్లు క్రిస్మస్ వేడుకలను నిర్వహించగా, మతపెద్దలు ఉప్పల వెంకటేశ్వర్లు,

మిగతా 8వ పేజీలో...

సర్వీస్ చార్జీలు చెల్లించలేదని విద్యుత్ సరఫరాలో ఆటంకం

- సాగునీటికి ఇబ్బందులతో ఆందోళనలో రైతులు

కేసముద్రం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ విద్యుత్ మోటార్లకు సర్వీసు చార్జీలు చెల్లించడంలేదని విద్యుత్ సరఫరాను అధికారులు తరచూ నిలిపివేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కేసముద్రం స్టేషన్ బ్రహ్మంగారితండా, వెంకటగిరి రోడ్డు, వెంకటగిరి, తదితర ప్రాంతాల్లోని వ్యవసాయ విద్యుత్ ఫీడర్ పరిధిలో సుమారు 60 మంది రైతులు ఉంటారని ఆ ప్రాంతంలోని అన్నదాతలు చెబుతున్నారు. ప్రతీ వ్యవసాయ విద్యుత్ మోటార్‌కు రోజుకు రూ.1 చొప్పున సంవత్సరానికి రూ.365లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ సర్వీస్ చార్జ్ సైతం కొంతమంది రైతులు ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో ఒక్కొక్కరు రూ.3వేలకుపైగా బకాయిలు ఉన్నారు. దీంతో సర్వీస్ చార్జీల వసూలు కోసం విద్యుత్ సిబ్బంది తరచూ సరఫరా నిలిపివేస్తున్నట్లు రైతులు తరాల వెంకన్న, ఆగె శ్రీను, దేవన్న, వెంకన్న, ఆది లక్ష్మణ్, బాబు, రమేష్, భరత్‌రెడ్డిలు ఆరోపించారు. తామంతా బిల్లులు చెల్లించామని అయినప్పటికీ మొండి బకాయిల వసూలు కోసం విద్యుత్ సరఫరాను తరచూ నిలిపివేయడంతో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. విద్యుత్ సరఫరా తరచూ నిలిపివేస్తుండడంతో ఈ యాసంగిలో బావుల కింద వరి, మొక్కజొన్న సాగుకు ఆటంకం ఏర్పడుతోందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి విద్యుత్‌ను తరచూ నిలిపివేయకుండా కరెంటు సరఫరా అందించాలని మండల రైతులు కోరుతున్నారు.

వనదేవతలకు ముందస్తు మొక్కులు



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు బుధవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లకు పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం, చీరె సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మినీ జాతర సమీపిస్తున్న నేపథ్యంలో భక్తులు ముందస్తుగా వనదేవతలను దర్శించుకున్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయులను కేజీబీవీలకు పంపొద్దు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలకు పంపొద్దని టీపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు హట్కర్ సమ్మయ్య బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్రశిక్షా అభియాన్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులు, ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం 16 రోజులుగా సమ్మె చేస్తున్న నేపథ్యంలో వారి స్థానంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులను నియమించాలని చూడడం సరికాదని అన్నారు. ఇప్పటికే విద్యావ్యవస్థ కుంటుపడిందని, చాలీచాలని వేతనాలతో గత 20ఏళ్లుగా పనిచేస్తున్న సమగ్రశిక్షా ఉపాధ్యాయులు, ఉద్యోగులకు టైంస్కేల్ వర్తింపజేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు న్యాయం చేయాలి

- మాజీ ఎంపీ సీతారాంనాయక్



సమ్మెకు సంఘీభావం ప్రకటిస్తున్న సీతారాంనాయక్, బీజేపీ నాయకులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యా శాఖ బలోపేతంలో కీలకపాత్ర పోషిస్తున్న సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్రనాయకుడు అజ్మీరా సీతారాంనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మె బుధవారం నాటికి 20వ రోజుకు చేరుకుంది. వర్షంలో సైతం సమ్మె చేస్తున్న శిబిరాన్ని జిల్లా బీజేపీ నాయకులతో కలిసి సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పి, విస్మరించాయని ఆరోపించారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడి హోదాలో నాటి సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మీ సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలుచేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి బేషజాలకు వెళ్లకుండా వారి న్యాయమైన డిమాండ్ ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు రెగ్యులర్ చేసుకోవచ్చని మాజీ కేంద్ర మంత్రి స్మృతిఇరాని పార్లమెంటులోనే చెప్పారని గుర్తుచేశారు. కేంద్రప్రభుత్వం ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ప్రతీ సంవత్సరం ఇస్తున్న వాటాను చెల్లిస్తుందని, మిగతా విషయాలను రాష్ట్ర ప్రభుత్వమే చూసుకోవాలన్నారు. ఈ సమ్మెలో వీరన్న రవీందర్, శేషు, బాబులాల్, హుస్సేన్, గణేష్, సాగర్, షేక్‌ముస్సీ, కల్పన, రవి పాల్గొన్నారు.

జూపార్కును శుభ్రం చేసిన అసెజ్ సంస్థ ప్రతినిధులు



జూపార్కు అధికారులతో సంస్థ ప్రతినిధులు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్‌లో ఉన్న జూపార్కులో పర్యాటకులు వేసే చెత్తను అసెజ్ సంస్థ ప్రతినిధులు బుధవారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జూపార్కులో ఉన్న ఫుడ్ ప్యాకేజింగ్ కవర్స్ డిస్పోజబుల్, ప్లాస్టిక్ కప్పులు, పానియాల సీసాలు సహా 200 కిలోల బరువు ఉన్న అన్ని రకాల చెత్తను సేకరించారు. ఈ కార్యక్ర మంలో అసెజ్ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- సరసనపల్లిలో పాల్గొన్న మంత్రి సీతక్క



సరసనపల్లిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి సీతక్క

కొత్తగూడ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మండలంలో పర్యటించారు. సరసనపల్లిలోని చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో సీతక్క పాల్గొని కేక్ కట్ చేశారు. కాగా, చర్చి నిర్వాహకులు సీతక్కను శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, మాజీ జడ్పీటీసీ పుల్సం పుష్పలత శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలిని చర్చి నిర్వాహకులు సన్మానించారు. కాగా, సీతక్క గ్రామస్థులతో సహపంక్తి భోజనం చేశారు. డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, మాజీ సర్పంచ్‌లు ఇర్ప రాజేశ్వర్, మల్లెల రణధీర్, ఈసం స్వామి, నాయకులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు మానవాళికి దిక్సూచి

మహబూబాబాద్ టౌన్ : ప్రపంచానికి శాంతి మార్గాన్ని బోధించిన ఏసుక్రీస్తు మానవాళికి దిక్సూచి అని సినీ హాస్యనటుడు రాజమౌళి అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, నెహ్రూ సెంటర్ ప్రాంతాల్లో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం నిరుపేద వృద్ధులకు 100 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం చేసే ప్రతీ పనుల్లోను, సహాయంల్లోను దైవత్వాన్ని చూడాలన్నారు. మనం ఎంత ఎదిగిన సమాజానికి చేసే సేవే ఉన్నత స్థానంలో నిలుపుతుందన్నారు. పేదలకు సహాయం చేయడంలోనే ఆత్మ సంతృప్తి ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత పేదలకు సాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజమౌళి కుటుంబ సభ్యుల సావిత్ర, భానుశ్రీ, రాఘవేంద్ర, పద్మ, కొమిరె వెంకన్న, బండ వెంకన్న, శంతన్‌రామారాజు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సినీ హాస్య నటుడు రాజమౌళి

ఏసుక్రీస్తు చూపిన మార్గం పవిత్రమైనది

గార్ల : సమాజంలో ప్రజలు ప్రేమ, కరుణ, దైవ మార్గం వైపు పయనిస్తూ.. ఏసుక్రీస్తు చూపిన మార్గాన్ని అనుసరించాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. క్రిస్మస్ వేడుకల సందర్భంగా బుధవారం గార్లలోని వర్తక సంఘం భవనంలో ప్రభుత్వం క్రైస్తవ సంఘస్తులతో కలిసి ఏర్పాటు చేసిన క్రిస్మస్ సందర్భంగా కేక్ కట్‌చేసి, సంబరాలను ఘనం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతికగా ప్రతీ ఒక్కరు క్రిస్మస్ వేడుకలను ఆనందంగా జరుపనుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, గుండా వెంకటరెడ్డి, దనియాకుల రామారావు, యాకుబ్ పాషా, బాబులాల్ నాయక్ చాంద్‌మాల్, డిప్యూటీ తహసీల్దార్ జర్పుల సుధాకర్ నాయక్, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్‌నాయక్, క్రైస్తవ సంఘస్తులు, మతపెద్దలు పాల్గొన్నారు.



గార్లలో కేక్ కట్ చేస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

డోర్నకల్‌లో ఘనంగా వేడుకలు

డోర్నకల్ : ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండగను బుధవారం డోర్నకల్‌లో ఘనంగా నిర్వహించారు. డోర్నకల్‌లోని చారిత్రాత్మక సీఎస్ఐ చర్చిలో తెల్లవారుజామున 4 గంటల నుంచి పరిసమభాగ్యపు ఆరాధనలతో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా క్రీస్తును స్తుతిస్తూ భక్తులు ప్రార్థన గీతాలను ఆలపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉమ్మడి కృష్ణ జిల్లా అవనిగడ్డకు చెందిన పాస్టర్ రబ్బాని చర్చిలో పులిపీట్ పై నుంచి భక్తులకు దైవసందేశాన్ని వినిపించారు. కాలాధ్యాయాన్ని కొలమానంగా తీసుకుంటే క్రీస్తు పూర్వ.. క్రీస్తు శకం ప్రారంభమైందని అన్నారు. ఏసుక్రీస్తు బోధనలు విశ్వవ్యాప్తమని, మానవుని సన్మార్గానికి ఎంతగానో తోడ్పాడుతాయన్నారు. గ్రీకు భాషలో క్రైస్టోస్ అనగా అభిషక్తుడని, లాటిన్ మస్ అనగా ఆరాధించబడే వారని దీనిని నుంచి క్రిస్టమస్ ఉద్భవించిందన్నారు. ఏసుక్రీస్తు రాక పూర్ణాంగీకారమైందని వివరించారు. అనంతరం భక్తులకు రొట్టెలు పంపిణీ చేసి ద్రాక్షరసం అందించారు. 8.30 గంటల సమయంలో పరిసమభాగ్యపు కార్యక్రమం ముగించారు. అనంతరం భక్తులకు దైవ ఆశీస్సులు అందించారు. క్రిస్మస్ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో చర్చికి హాజరయ్యారు. డోర్నకల్‌లోని జీసస్ క్రైస్ట్ ఎల్‌షేలం చర్చిలో పాస్టర్ కిరణ్ కుమార్ దైవసందేశం వినిపించారు. మండలంలోని ముల్కలపల్లి, తోడేళ్లగూడెం, ఉయ్యాలవాడ, వెన్నారం, సంకీస, చిల్కోడు, గొల్లచర్ల, చాంప్లాతండాల్లోని చర్చిలో ఆయా పాస్టర్లు క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు.

భార్యపై కోపంతో భర్త వికృత చేష్టలు

- భార్య స్వగ్రామంలో దారి వెంట ఆమె దుస్తులను పడవేసిన భర్త
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన భార్య

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భార్య పైన కోపంతో ఓ భర్త ఆమె దుస్తులను రోడ్డు మీదుగా పడవేసి వికృత చేష్టలకు పాల్పడిన ఘటన మండలంలోని రాఘవపూర్‌లో బుధవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన గాదెపాక యాదగిరి కుమార్తె ఉమను 15 ఏళ్ల క్రితం హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన గంగారపు సురేందర్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దంపతులిద్దరూ కొన్ని నెలల క్రితం ఓ వ్యక్తి వద్ద అప్పు తీసుకున్నారు. అప్పు ఇచ్చిన వ్యక్తితో భార్య తరుచుగా మాట్లాడుతోందని అనుమానం పెంచుకున్న సురేందర్ పలుమార్లు ఉమను కొట్టి తల్లిగారింటికి పంపించాడు. తరువాత పెద్దల సమక్షంలో ఇద్దరికి నచ్చజెప్పి ఉమను భర్తతో ధర్మసాగర్ పంపించారు. అయినప్పటికీ సురేందర్‌లో మార్పు రాకపోగా ఉమను వేధింపులకు గురిచేస్తూనే ఉన్నాడు. దీంతో రెండు నెలల క్రితం ఉమ తిరిగి తల్లిగారింటికి వచ్చింది. అప్పటి నుంచి భార్యపై కోపం పెంచుకున్న సురేందర్ మంగళవారం రాత్రి భార్య దుస్తులను ఫోటోలను పట్టుకొని రాఘవపూర్‌కు వచ్చాడు. బస్టాండ్ నుంచి భార్య ఇంటి వరకు సుమారు అరకిలోమీటర్ మేర దారి వెంట భార్య దుస్తులను చెట్ల పైన, కరెంట్ స్తంభాలపైన, బోర్డుల పైన, అంబేద్కర్ విగ్రహం పైన, ఎక్కడపడితే అక్కడ పడవేశాడు. ఉమ ఫొటోలను కత్తిరించి వీధిలో పలుచోట్ల పడవేశాడు. భార్య దుస్తుల పైన ఉమ చేసిన ఘనకార్యం అంటూ అసభ్యకరంగా రాతలు రాసి వీధిలో పలుచోట్ల పడవేసి దుశ్చర్యలకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని జీపీసిబ్బంది సహకారంతో రోడ్లు పైన పడవేసిన దుస్తులను తొలగింపజేశారు. సురేందర్ తీరును చూసిన గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై అనుమానంతో వికృతచేష్టలకు పాల్పడిన భర్తపైన ఉమ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.



భార్య చీరెలను చెట్టుపైన పడవేసిన భర్త



ఉమ ఫొటోలను చించి పడేసిన దృశ్యం

జోరుగా అసెస్‌మెంట్ దందా

- ఇంటి నంబరును ఆన్‌లైన్ చేసేందుకు వసూళ్లు

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీల్లో అసెస్‌మెంట్ దందా జోరుగా సాగుతోంది. ఆన్‌లైన్‌లో కొత్త నంబరు జారీ చేసేందుకు భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. గ్రామ పంచాయతీలో వివరాలు నమోదై ఉన్నప్పటికీ అదే నంబరును ఆన్‌లైన్ చేసేందుకు ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు భారీ మొత్తంలో దండుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా మహదేవపూర్, కాళేశ్వరం, సూరారం, అంబట్‌పల్లి వంటి మేజర్ గ్రామ పంచాయతీల్లో ఎక్కువ మొత్తంలో ఈ అక్రమాలు చోటుచేసుకుంటున్నట్లు సమాచారం. మిగతా గ్రామ పంచాయతీల్లోనూ ఈ దందా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అవసరాలే ఆసరాగా..

గ్రామ పంచాయతీలో ఆస్తి వివరాలు రికార్డు అయ్యుండి ఇంటి నంబరు సైతం జారీ చేసి ఉన్నప్పటికీ అవి ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. వాటికి అసెస్‌మెంట్ నెంబర్లను కేటాయించలేదు. అయినప్పటికీ ప్రతి సంవత్సరం ఆ ఇంటి నెంబర్లతో మాన్యువల్ పద్ధతిన ఇంటి పన్ను వసూలు చేస్తున్నారు. ప్రైవేటు, ప్రభుత్వరంగ బ్యాంకుల్లో లోన్లకు దరఖాస్తు చేసుకున్నప్పుడు మాన్యువల్ ట్యాక్స్ రశీదు బ్యాంకర్లు పరిగణనలోకి తీసుకోకపోతుండటంతో ఆన్‌లైన్ నమోదు కోసం ఇళ్ల యజమానులు గ్రామ పంచాయతీల బాట పడుతున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న కొందరు అధికారులు వారి అవసరాన్ని ఆసరాగా చేసుకుని వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మేజర్ గ్రామ పంచాయతీల్లోనైతే ఒక్కో ఇంటి నెంబరును ఆన్‌లైన్ చేసేందుకు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. దీనికి ఒప్పుకోకపోతే కొత్త ఇంటి నిర్మాణ అనుమతికి దరఖాస్తు చేసుకోవాలంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల అలసత్వం

పంచాయతీ ద్వారా అధికారికంగా ట్యాక్సు వసూలు చేసే అధికారులు వాటిని ఆన్‌లైన్ ఎందుకు చేయడం లేదని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పైగా వాటిని ఆన్‌లైన్ చేసేందుకు ప్రత్యేక రేట్ టారిఫ్‌లను ఆఫర్ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అన్ని పత్రాలూ సరిగా ఉండి కొత్త ఇంటి కోసం అనుమతులు వచ్చినప్పటికీ ఆ పత్రం ఇచ్చేందుకు చిన్న గ్రామాలకు సంబంధించిన ఈ-ఆపరేటర్లు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని మేజర్ గ్రామ పంచాయతీలు మినహా ప్రతి గ్రామ పంచాయతీకి ఈ పంచాయతీ ఆపరేటర్లు లేకపోవ డంతో గ్రామ పంచాయతీలు అన్నింటికీ కలిపి ఒకరిద్దరినే నియమించారు. వారు సైతం అనుమతి, ఇతర అప్రూవల్స్ పొందిన వాటిని ఇచ్చేందుకు రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఇప్పటికే ఆఫ్‌లైన్ ద్వారా అనుమతులు పొంది ట్యాక్సు చెల్లించే వారి ఆస్తులను ఆన్‌లైన్ చేయాలని పలువురు కోరుతున్నారు. ఆన్‌లైన్ చేసేందుకు అలసత్వం వహిస్తున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలనే డిమాండ్ చేస్తున్నారు.

జనజీవన స్రవంతిలోకి మహిళా మావోయిస్టు

- పోలీసుల ఎదుట లొంగుబాటు
- రివార్డు అందజేసిన ఎస్పీ శబరీశ్

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ములుగు పోలీసుల ఎదుట మావోయిస్టు పార్టీ నేషనల్ పార్క్ ఏరియా కమిటీ సభ్యురాలు అలువ స్వర్ణ బుధవారం లొంగిపోయింది. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శబరీశ్ వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా కలిమెల మండలం పొట్టేరు గ్రామానికి చెందిన అలువ స్వర్ణ అలియాస్ స్వర్ణక్క 2000లో కలిమెల ఏరియా కమిటీ కమాండర్ రామన్న ప్రోత్సాహంతో మావోయిస్టు పార్టీలో సభ్యురాలిగా చేరింది. అప్పట్లో నార్త్ తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ(ఎన్‌టీఎస్‌జడ్‌సీ) సభ్యుడైన చట్టిరాజ పాపయ్య అలియాస్ సోమన్న ప్రొటెక్షన్ టీంలో చేరిన ఆమె మూడేళ్లపాటు పార్టీ సభ్యురాలిగా పనిచేసింది.. ఆ తర్వాత గినుగు నరసింహారెడ్డి అలియాస్ జంపన్న ప్రొటెక్షన్ టీంలో చేరి ఐదేళ్లు కొనసాగింది. ఈక్రమంలో 2005 జనవరి 16న కర్లగండి - రాంపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో పాల్గొనగా ఈ ఘటనలో నల్ల వసంత్ అలియాస్, తాళ్ల సుదర్శన్ అలియాస్ గంగన్న అనే ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. స్వర్ణతోపాటు మరి కొంతమంది పార్టీ సభ్యులు తప్పించుకుని పారిపోయారు. అదే సంవత్సరం నవంబరు 5న లింగాలగుట్ట-పాలధారగుట్ట ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో కూడా స్వర్ణ పాల్గొంది. ఈ ఘటనలో బట్టు ఎలిశా అలియాస్ మమత మరణించగా స్వర్ణ, మరికొంత మంది సభ్యులు తప్పించుకున్నారు. 2006లో అప్పటి నార్త్ తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీలో సోమన్న ప్రొటెక్షన్ టీం కమాండర్‌గా పని చేస్తున్న ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల గ్రామానికి చెందిన కురసం సాయన్న అలియాస్ జగత్‌ను వివాహం చేసుకుంది. 2008లో ఏరియా కమిటీ సభ్యురాలిగా పదోన్నతి పొంది అప్పటి కేంద్ర కమిటీ సభ్యుడైన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్, రావుల శ్రీనివాస్ అలియాస్ రామన్నకు ప్రొటెక్షన్‌గా పని చేసింది. 2015లో వెస్ట్ బస్తర్‌కు బదిలీపై వెళ్లిన స్వర్ణ నేషనల్‌పార్క్ ఏరియా కమిటీలో సభ్యురాలిగా చేరి సండ్ర ఎల్‌వోఎస్ కమాండర్‌గా రెండేళ్లు కొనసాగింది. 2017లో నేషనల్‌పార్క్ ఏరియా కమిటీ కార్యదర్శిగా ఉన్న తన భర్త కురసం సాయన్న గుండం ఎదురుకాల్పుల్లో మృతి చెందగా స్వర్ణ మానసికంగా కుంగిపోయి అనారోగ్య బారిన పడింది. ఆ తర్వాత సండ్ర ఎల్‌వోఎస్ కమాండర్ పదవి నుంచి నేషనల్ పార్క్ ఏరియా కమిటీ జనతన సర్కార్ అధ్యక్షురాలిగా రెండేళ్లు వ్యవహరించింది. 2019 నుంచి ఇప్పటి వరకు కృషి (వ్యవసాయం) విభాగం అధ్యక్షురాలిగా కొనసాగుతోంది.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శబరీశ్

ప్రస్తుతం మావోయిస్టు భవిష్యత్ మనుగడ సాగించే అవకాశం లేదని, పార్టీ సిద్ధాంతాలు అర్థరహితమని తెలుసుకున్న స్వర్ణ కుటుంబంతో కలిసి ప్రశాంత జీవితాన్ని గడపాలని నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో ములుగు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయిందని ఎస్పీ తెలిపారు. అజ్ఞాతంలో ఉన్న మిగతా మావోయిస్టు నాయకులు, సభ్యులు పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని కోరారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వపరంగా పునరావాసం కల్పించి అన్నివిధాలుగా అండగా ఉంటామని తెలిపారు. అనంతరం స్వర్ణకు ఎస్పీ ఆర్థికసాయం అందజేశారు. ఈసమావేశంలో ములుగు డీఎస్పీ, ఇన్‌చార్జి ఓఎస్డీ ఎస్.రవీందర్, సీఆర్పీఎఫ్- 39 అసిస్టెంట్ కమాండెంట్ ఎం.శ్రీనివాస్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ట్యాంకర్ లారీ బీభత్సం

- మేక మృతి, ఆర్టీసీ బస్సు ధ్వంసం
- మద్యం మత్తులో డ్రైవర్?
- చితకబాదిన ప్రయాణికులు, గ్రామస్థులు

కొత్తగూడ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో బుధవారం ఓ ట్యాంకర్ లారీ బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో బస్సు వెనుక నుంచి ఢీ కొట్టడంతో పాటు ఓ మేక మృతి చెందగా, డ్రైవర్‌ను ప్రయాణికులు, గ్రామస్థులు చితకబాదారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తగూడ నుంచి నర్సంపేటకు వెళుతుండగా గాదె వాగు వద్ద మేకల మందను ట్యాంకర్ లారీ ఢీకొట్టడంతో ఒక మేక మృతిచెందగా, మరికొన్నింటికి గాయాలయ్యాయి. అదే దారిలో వెళ్తూ వరంగల్ జిల్లా చిలకమ్మ నగర్ వద్ద ఆర్టీసీ బస్సును లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో కొంతమేరకు బస్సు ధ్వంసమైంది. దీంతో ఆగ్రహించిన ప్రయాణికులు, గ్రామస్థులు డ్రైవర్‌ను చితకబాదారు. కాగా, డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



బీభత్సం సృష్టించిన లారీ

మతిస్థిమితం లేని వృద్ధుడి అదృశ్యం

పర్వతగిరి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని వృద్ధుడు కొల్లూరి యాకయ్య అదృశ్యమయ్యాడు. వారం కిందట ఇంటి నుంచి బయటకు వచ్చిన యాకయ్య నడుచుకుంటూ ఎటో వెళ్లిపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వృద్ధుడి ఆచూకీ తెలిసినవారు 9908355851, 9652625795 నెంబర్లలో తెలియజేయాలని కుటుంబ సభ్యులు కోరారు.



యాకయ్య (ఫైల్)

రైతు కమిషన్ ఛైర్మన్‌ను కలిసిన కేలోత్‌తండా రైతులు

గార్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కేలోత్ తండా మిర్చి రైతులు నకిలీ విత్తనాలను విక్రయించి, మోసం చేశారని కోరుతూ బుధవారం రాష్ట్ర రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. గార్ల మండలంలోని కేలోత్ తండా రైతులు ఖమ్మం జిల్లా కేంద్రంలో సాయికృష్ణ సీడ్స్‌కు చెందిన మిర్చి విత్తనాలు కొనుగోలు చేశారు. వీటిని రైతులు సాగు చేయగా సన్నరకం కాపు రావాల్సి ఉండగా, కాయలు దొడ్డురకం రావడంతో తీరని నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. నకిలీ విత్తలు విక్రయించిన సదరు డీలర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామంలో కొందరు రైతులు రాష్ట్ర రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డిని కలిసి తమ గోడును వెలిబుచ్చుకున్నారు. దీంతో స్పందించిన కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి నకిలీ విత్తనాలపై వ్యవసాయ శాఖ డైరెక్టర్‌కు లేఖ రాసినట్లు తెలిసింది. రెండు వారాల్లో నకిలీ విత్తనాలు విక్రయించిన షాపుల వివరాలను తమకు నివేదిక అందజేయాలని కోదండరెడ్డి ఆదేశించినట్లు తెలిసింది.

కారుమబ్బులే కనువిందు



వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. చూస్తూ చూస్తుండగానే కారు మబ్బులు కమ్ముకున్నాయి. అకాల వర్షానికి ముందు అవి ప్రత్యక్షమై ఆకాశాన నాట్యమాడాయి. ములుగు జిల్లా వాజేడు మండలంలోని పూసూరు-ముళ్లకట్ట వంతెన వద్ద ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. తుఫాను ప్రభావంతో బుధవారం ఉదయం నుంచి చిరుజల్లులు కురిసిన వేళ కారు మబ్బులు ఇలా కనువిందు చేశాయి.

- వాజేడు (ఆంధ్రజ్యోతి)

క్రిస్మస్ సందడి

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వేడుకలు



చర్చిల్లో క్రైస్తవుల ప్రార్థనలు

వరంగల్ నగరంలో క్రిస్మస్ పర్వదినం ఉత్సాహంగా సాగింది. క్రైస్తవులు ఉదయాన్నే సమీపంలోని చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. పాస్టర్లు ఏసు జననాన్ని, ఆయన బోధనలను వివరించారు. అనంతరం కేక్‌లు కట్ చేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని అభినందనలు తెలుపుకున్నారు.



ములుగులో క్రిస్మస్ సందర్భంగా మంత్రి సీతక్కకు ఏసుప్రభువు చిత్రపటాన్ని బహూకరిస్తున్న క్రైస్తవులు



ప్రార్థన చేస్తున్న పాస్టర్ నిరంజన్



పాలకుర్తిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేట్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



స్టేషన్ ఘన్‌పూర్ నిర్మల మాత చర్చిలో కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య



సీబీసీ వద్ద సెల్ఫీ దిగుతున్న యువతులు



ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటున్న దృశ్యం







హనుమకొండలోని సెంటినరీ బాప్టిస్టు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



భూపాలపల్లిలోని సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకలు



తొర్రూరు సీఎస్ఐ చర్చి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మాజీమంత్రి దయాకర్‌రావు



డోర్నకల్ సీఎస్ఐ చర్చిలో దైవ సందేశం విని పిస్తున్న పాస్టర్ రబ్బాని



కాశిబుగ్గ బీఎస్‌నగర్ చర్చి ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

వారణాసిలో ఓరుగల్లు కెరటం

- న్యాయవాదులకు సవాల్‌గా నిలిచిన ఐఏఎస్ సాయి అశ్రిత్
- తన వాహనాన్నే కోర్టు హాలుగా మలచి పేదలకు న్యాయం
- దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్న ప్రశంసలు



వారణాసి జిల్లా రాజతలాబ్ కోర్టు ఆవరణలో తన వాహనంలోనే తీర్పులు వెలువరుస్తున్న సాయి అశ్రిత్

మిల్స్‌కాలనీ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లుకు చెందిన యువ ఐఏఎస్ అధికారి శాఖమూరి సాయి అశ్రిత్ ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో అనితర సాధ్యమైన పనిచేశారు. న్యాయవాదులు కోర్టు తలుపులు మూసినా.. తన అధికారిక వాహనాన్నే కోర్టుగా మలిచి పేద ప్రజలకు న్యాయ సహాయం అందించారు. ఉత్తరప్రదేశ్‌లో సాక్షాత్తు ప్రధాని నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి జిల్లా రాజతలాబ్ డివిజన్‌లో జాయింట్ కలెక్టర్/మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న సాయి అశ్రిత్ విధుల్లో తనదైన ముద్ర వేస్తున్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా అందరికీ ఆదర్శనీయంగా నిలుస్తున్నారు. వివరాల్లోకి వెళితే...

రాజతలాబ్ రెవెన్యూ కోర్టులో మంగళవారం సాయి అశ్రిత్ ఓ భూవివాదానికి సంబంధించి తాజా ధ్రువీకరణ పత్రం సమర్పించాలని న్యా యవాదికి సూచించి తదుపరి విచారణను వాయిదా వేశారు. దీంతో సదరు న్యాయవాది అశ్రిత్‌తో వాగ్వాదానికి దిగారు. కేసు వాయిదా వేయద్దని, తక్షణమే తీర్పు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అతడికి మద్దతుగా ఇతర న్యాయవాదులు సైతం వచ్చి కోర్టు తలుపులు మూసివేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన అశ్రిత్ కోర్టు ఆవరణలోనే ఉన్న తన అధికారిక వాహనాన్ని కోర్టు హాల్‌గా మార్చారు. తన వాహనానికి ఉన్న లౌడ్ స్పీకర్ల ద్వారా కోర్టు కార్యకలాపాలను కొనసాగించారు. పిటిషనర్లను పిలుస్తూ వారి వాదనలు రికార్డు చేస్తూ అక్కడికక్కడే ఆదేశాలు ఇచ్చారు. దీంతో బిత్తరపోయిన న్యాయవాదులు బేరానికి వచ్చారు. తిరిగి కోర్టులోకి రావాలని అశ్రిత్‌ను అభ్యర్థించారు. వారి అభ్యర్థనను మన్నించిన అశ్రిత్.. కోర్టులో విధులను కొనసాగించారు. న్యాయపరంగా బాధితుల పక్షం వహిస్తూ అశ్రిత్ వ్యవహరించిన తీరును అందరూ ప్రశంసిస్తున్నారు.



శాఖమూరి సాయి అశ్రిత్

అశ్రిత్‌కు దేశవ్యాప్తంగా జేజేలు

ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి జిల్లా రాజ్‌తలాబ్ కోర్టు ఆవరణలో జరిగిన సంఘటన తొలుత అక్కడి మీడియాతో పాటు జాతీయ మీ డియాను ఆకర్షించింది. దీంతో ఈ సమాచారం దేశవ్యాప్తంగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఐఏఎస్ శిక్షణ పూర్తి చేసు కొని ఆరు నెలల కిందటే ఆయన రాజ్‌తలాబ్ జాయింట్ కలెక్టర్‌గా జాయిన్ అయ్యారు. అశ్రిత్ వృత్తి నిబద్ధతకు మంత్రముగ్ధులైన వారణాసి ప్రజలతో పాటు దేశ వ్యాప్తంగా ప్రజలు అశ్రిత్‌కు జేజేలు పలుకుతున్నారు. హనుమకొండ వాస్తవ్యుడు శాఖమూరిఅమర్ కుమారుడైనసాయి అశ్రిత్ సివిల్స్ 2022లో జాతీయ స్థాయిలో 40వర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికైన విషయం తెలిసిందే.

కవ్వాల్ ఫారెస్టుపై పరిశోధనా పత్రం

హనుమకొండ, డిసెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన పొడిశెట్టి వరుణ్ కవ్వాల్ టైగర్ రిజర్వు అడవులపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. సిద్దిపేట జిల్లా ములుగు అటవీ కళాశాల, పరిశోధనా సంస్థలో ఎమ్మెస్సీ 2022-24 బ్యాచ్‌కు చెందిన వరుణ్.. తన ఎమ్మెస్సీ పరిశోధనలో భాగంగా గిట్టల క్షీరజాల మేత, ఉడుంపూర్ రేంజ్, కవ్వాల్ టైగర్ రిజర్వు అడవులపై ప్రభావం అన్న అంశంపై పరిశోధించి దాని ఫలితాలను ప్రచురించారు. ఈ పరిశోధన ఛైర్మన్ డాక్టర్ మిల్కూరి చిరంజీవి రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించడం గర్వంగా ఉందని వరుణ్ పేర్కొన్నారు. ఈ పరిశోధన అటవీ సంరక్షణ, నిర్వహణకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ పరిశోధన ద్వారా ఎక్కువగా మేయడం వల్ల జీవవైవిధ్యం, నేల లక్షణాలు దాని సారం, అలాగే వృక్షజాతి పునరుత్పత్తిపై ఉదంపుపూర్‌లోని అడవులలో ఎలాంటి ప్రభావం ఉందనేది కనుగొన్నట్టు తెలిపారు.



పరిశోధనా పత్రంతో పొడిశెట్టి వరుణ్

కళల్లో ప్రవేశం ఉన్నా.. కరువైన ఆదరణ

- కమనీయ కళాఖండాలతో రమేశ్ ప్రతిభ
- గ్రామీణ ప్రాంత ప్రజల హృదయాల్లో నిలిచిన జానపద కళాకారుడు

నెక్కొండ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సృజనాత్మకత, పట్టుదల ఉండాలే కానీ.. ప్రకృతిలో దొరికే ఏ వస్తువునైనా సరే కమనీయ కళాఖండాలుగా ఆవిష్కరించవచ్చని నిరూపిస్తున్నాడు వరంగల్ జిల్లా నెక్కొండ మండలం తోపనపల్లి గ్రామానికి చెందిన జానపద కళాకారుడు తంగళ్లపెల్లి రమేశ్. ఆర్థికపరమైన అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఓ సగటు గ్రామీణ యువకుడు సమాజంలో గుర్తింపు పొందడంతో పాటు సామాజిక సేవ చేయాలన్న దృఢ సంకల్పం అన్ని కళల్లో తాను సైతం అంటున్నాడు. తెలంగాణ ఉద్యమ కాలంలో తన ఆట పాటలతో ప్రజలను చైతన్యవంతులు చేయడంలో సఫలీకృతుడైన రమేశ్.. వివిధ కళా, సాంస్కృతిక విభాగాల్లో తన ప్రతిభను ప్రదర్శించి దేశవ్యాప్తంగా జరిగిన పలు పోటీల్లో అవార్డులను అందుకుంటున్నా ప్రభుత్వ ఆదరణకు మాత్రం నోచుకోవడంలేదు. అతని చేతి వేళ్లతో అనేక అందమైన చిత్రాలు రూపుదిద్దుకుంటున్నాయి. రంగులతో రమేశ్ వేసే స్పాట్ పెయింటింగ్స్ బహుమతులను గెలుచుకున్నాయి. చీపురు పుల్ల, అగ్గిపుల్ల, సుద్దముక్క, థర్మకోల్ లతో రమేశ్ రూపొందించిన కళాకృతులు అందరినీ అబ్బురపరుస్తున్నాయి. వక్తృత్వ, వ్యాసరచన రాష్ట్రవ్యాప్తంగా పోటీల్లో పాల్గొని బహుమతులను అందుకున్నారు. తంగళ్లపల్లి రమేశ్ కళలో చూపుతున్న ఆదరణతో మండలంలో జానపద కళా రమేశ్‌గా గుర్తింపును పొందాడు.

రమేశ్ రచించిన జానపద కవితా కుసుమాలు

మాతృభాషపై మక్కువతో.. అమ్మపాల స్వచ్ఛత తెలుగు అంటూ, పూల జాతర బతుకమ్మ పై.. తీరొక్క పూలవనం.. ఒక్కటై కూర్చి పేర్చినా బతుకమ్మల సమ్మేళనం అంటూ, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిగా.. అగ్ని కణికమై భగ్గుమనాలిరా యుద్ధమే జరగాలిరా అంటూ, రైలు రోకోపై.. రైలు కూతే ఆపమంది రణం చేయరమ్మంది అంటూ, సత్యాగ్రహం స్ఫూర్తిగా.. ఉసిళ్ల పుట్టోలే ఉరికిరండి చీమల దండోలే సాగిరండి అంటూ, అన్నదాతల స్థితిపై.. అన్నన్న మాయన్న అన్నా రైతన్న అంటూ, మిలియన్ మార్చ్ స్ఫూర్తిగా సబ్బండ వర్ణాలు ఏకమవ్వగా కవాతు చేయగా కదిలిరండంటూ అనేక రచనలతో సమాజంలో స్ఫూర్తిని కల్గిస్తున్నారు.



నెక్కొండ మండలంలోని గిరిజన తండాలో తోటి కళాకారులతో కలిసి పాటలు పాడుతున్న రమేశ్



చీపురు పుల్లలతో తయారు చేసిన చిత్రాలు

సుద్దముక్కలతో తయారు చేసిన అమరుల స్థూపం

సమాజాన్ని చైతన్యపరిచేందుకు నాటకాలను సైతం..

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు, నిరక్షరాస్యుల్లో స్ఫూర్తిని కలిగించేందకు ఎసమాజంలో చదువుకు ఉన్న విలువ్ ఎయిడ్స్ , క్యాన్సర్ వంటి భయంకర వ్యాధిపై ఎకళ్ళు తెరిచి చూడరా ఓరన్నో అనే నాటకాలను రచించగా ఈ ప్రదర్శనలు ప్రజాధరణ పొందాయి. అలాగే ఎచింతచెట్టు కొమ్మన్ వంటి రమేశ్ రచించిన అనేక జానపద గేయాలు వివిధ ప్రైవేట్ చానళ్లలో ప్రసారం చేయగా ప్రేక్షకుల అదరణ అభించింది.

మానవుడి మనోవికాసానికి జానపద కళారూపాలు



మానవుడి మనోవికాసానికి, వినోదానికి మంచి నడవడికి జానపద కళారూపాలు ఆలంబనగా నిలిచాయి. సినిమాలు, టీవీలు లేని ఆ రోజుల్లో ఈ వృత్తి కళాకారుల ప్రదర్శనలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అలసిపోయిన పల్లె ప్రజలకు జానపద కళకారుల ప్రదర్శనలు సేదతీర్చేవి. జానపద కళలను నమ్ముకుని జీవనం సాగించిన కళాకారులకు నేడు ఆదరణ కరువవ్వడంతో, కళలను నమ్మూకోలేక.. నమ్ముకున్న కళలకు కూడు పుట్టక దుర్భర జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం జానపద కళాకారులను ఆదుకోవాలి.

\- తంగళ్లపెల్లి రమేశ్, తోపనపల్లి, నెక్కొండ

రమేశ్ సృష్టించిన కళాకండాలు

ఐస్‌క్రీం పుల్లలతో సృష్టించిన తెలంగాణ అమరవీరుల స్థూపం, సుద్దముక్కలతో చార్మినార్, కాకతీయ కళాతోరణం, చీపురు పుల్లలతో పల్లె గణపతి, తాజ్‌మహల్, అమరుల స్థూపం, తెలంగాణ తల్లి స్పాట్ పెయింటింగ్, రైతన్నల ఎడ్లబళ్లు వంటి వాటిని అనేక కళాకండాలను తయారు చేస్తున్నారు.

బీపీ.. షుగర్.. భయపెడుతున్నయ్..

(5వ పేజీ తరువాయి)

ఉండగా, 35,952మంది మహిళలు ఉన్నారు. మధుమేహం కేసులు 38,726 నమోదవగా.. 39,898 మంది పురుషులు, 35,952మంది మహిళలున్నారు. ఇక పూర్తిగా ఏజెన్సీ జిల్లా అయిన ములుగులో బీపీ, షుగర్లకు కట్టడి పడుతోంది. నగర ప్రాంతాలతో పోలిస్తే ములుగు జిల్లాలో బీపీ, షుగర్ కేసుల సంఖ్య తక్కువగా నమోదవుతున్నాయి. ములుగు జిల్లాలో 1,56,450మందికి బీపీ పరీక్షలు చేస్తే 17,426 మందికి బీపీ ఉన్నట్టుగా గుర్తించారు. అంటే 11.13శాతం మందికి మాత్రమే రక్తపోటు ఉంది. అలాగే 1,50,498మందికి షుగర్ టెస్టులు నిర్వహిస్తే కేవలం 7,290మందికి మాత్రమే మధుమేహం ఉన్నట్టుగా గుర్తించారు. అంటే కేవలం 4.85శాతం ప్రజలు మాత్రమే మధుమేహం బారిన పడ్డట్టుగా నిర్ధారించారు. అయితే గతంతో పోల్చితే ములుగు ఏజెన్సీలో ఈ వ్యాధులు గణనీయంగా పెరిగినట్టు భావిస్తున్నారు. వరంగల్‌తో పోల్చితే తక్కువే అయినా, ఆక్సిజన్ ఎక్కువగా లభించే అటవీ ప్రాంతాల్లో శారీరక శ్రమతో పాటు ఒత్తిడి లేకుండా జీవించే ప్రజల్లో ఈ మార్పు కూడా ప్రమాదకరమేనని వైద్యనిపుణులు హెచ్చరి స్తున్నారు. వీటితో పాటు హనుమకొండ జిల్లాలో గణనీయంగా 68శాతం ప్రజలను బీపీ లేదా షుగర్ వెంటాడుతున్నాయి. భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో కూడా ఈ జీవన శైలి జబ్బులు విస్తరిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో 25ఏళ్ల నుంచి 40ఏళ్ల యువతే బీపీ, షుగర్ బారిన పడుతుండగా, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం 45 ఏళ్ల నుంచి 50ఏళ్ల పైబడిన వారే బీపీ లేదా షుగర్ బారిన పడుతున్నట్టు ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో తేలింది. ఈ స్థాయిలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బీపీ, షుగర్ బాధితులు పెరగడం అత్యంత ఆందోళన కలిగించే అంశమని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

నియంత్రణ లేక.. గుండె జబ్బుల గురై..

ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యంపై శ్రద్ధ లేకుండా పోతోంది. చిన్న వయసులోనే సంపాదన, ఉద్యోగం, వృత్తిపై యువత దృష్టి పెట్టి ఆరోగ్యాన్ని పట్టించుకోవడం మరిచిపోతున్నారు. కంప్యూటర్‌పై ఉద్యోగాలు చేసేవారు, ప్రైవేట్ ఉద్యోగులు, నిరుద్యోగులు ఉద్యోగాల వేటలో ఒత్తిడికి గురవుతున్నవారు. ఆహార శారీరక శ్రమ లేకపోవడం తదితర కారణాలతో బీపీ, షుగర్‌లకు గురవుతున్నారని వైద్యులు అభిప్రాయ పడుతున్నారు. ఖాళీగా ఉన్న యువత సెల్‌ఫోన్లు, కంప్యూటర్లకు అతుక్కపోయి ఒత్తిడికి గురవుతున్నారు. సోషల్ మీడియాకు బానిసగా మారి ఒత్తిడిని పెంచుకుంటూ.. బీపీని తెచ్చుకుంటున్నారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. డయాబెటీస్ జీవనశైలిపై ఆధారపడి ఉంటుందని, వంశ పారం పర్యంగా లేదా మానసిక ఒత్తిడి, జంక్‌ఫుడ్ తినడం, సరైన వ్యాయామం చేయకపోవటం, పొగాకు, మద్యం, డ్రగ్స్ లాంటి వ్యసనాలు ఉన్నవారికి షుగర్ ఎటాక్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. జీవన శైలిపై నియంత్రణ లేకపోవడంతో రక్తపోటు, మధుమేహం పెరిగి గుండె జబ్బులకు దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

రక్తపోటు, మధుమేహం నియంత్రణ ఇలా..

- ఒత్తిడిని తగ్గించుకునేందుకు యోగ, నడక, శారీరక శ్రమకు వ్యాయం
- ప్రతి రోజు కనీసం గంట సమయం వ్యాయమానికి కేటాయించాలి
- జంక్ ఫుడ్‌లకు, ఇంటి బయటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి
- ప్రతి రోజు వయస్సును బట్టి 6నుంచి 8గంటల కంటినిండా నిద్రపోవాలి
- అవసరం లేని సమయంలో కంప్యూటర్, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి
- ప్రతీ రెండు నెలలకు ఒకసారి షుగర్ టెస్టులు చేయించాలి. ప్రాథమిక స్థాయిలో ఉంటే మందులు లేకుండానే నియంత్రించే అవకాశం ఉంది.
- 30ఏళ్లు దాటిన ప్రతీ ఒక్కరు ఎన్‌సీడీ (జీవన శైలి జబ్బులు) స్క్రీనింగ్ చేయించుకోవాలి.
- మద్యం, డ్రగ్స్, పొగాకు లాంటి వాటికి దూరంగా ఉండాలి

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

(5వ పేజీ తరువాయి)

తడిసిపోయింది. సీరోలు కొనుగోలు కేంద్రంలో కిందభాగంలో బస్తాలు తడిసిపోయాయి. కొత్తగూడ, మైలారం తండ కొనుగోలు కేంద్రాల్లో బస్తాలు కిందిభాగంలో తడిసిపోయాయి. గార్ల, కురవి, నర్సింహులపేట, బయ్యారం, మరిపెడ, పెద్దవంగర, తొర్రూరు, మహబూబాబాద్, గూడూరు, ఇనుగుర్తి మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో బస్తాలపై టార్పాలిన్‌లు కప్పుకున్నారు. నెల్లికుదురులో వర్షం కురిసింది. కొన్ని కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం బస్తాల కిందిభాగంలో తడిశాయి. బయ్యారం మండలంలో 90 శాతం వరికోతలు పూర్తికాగా, ఇంకా 10శాతం కొయ్యలేదు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్‌లు కప్పుకుని వర్షం నుంచి కాపాడుకున్నారు. కేసముద్రం మండలంలో కల్వల, తాళ్లపూసపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌లు కప్పుకున్నప్పటికి ధాన్యం బస్తాలు తడిసిపోయాయి.

ప్రధానిగా వాజ్‌పేయి దేశానికి సేవలు

(5వ పేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ పరిపాలించినప్పటికి ఏ ఒక్క రోజూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం కృషి చేయలేదన్నారు. 2014లో రామప్పకు యూనెస్కో అవార్డు లభించిందని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం వలిగొండ నుంచి భద్రాచలం వరకు 225 కిలోమీటర్ల రహదారిని జాతీయ రహదారిగా గుర్తించి, నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. భద్రాచలంలోని రామాలయ సర్క్యూట్ గెస్ట్‌హౌస్ నిర్మాణం కోసం కేంద్రప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసిందని వివరించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమతో పాటు బయ్యారం పెద్ద చెరువును పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, క్యాచువల్ శ్యాంసుందర్ శర్మ, మోసంగి మురళి, సింగారపు సతీష్, దార ఇందుభారతి, గడ్డం అశోక్, మల్లం యశ్వంత్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

● తొర్రూరు (ఆంధ్రజ్యోతి) : అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలు బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో వాజ్‌పేయి చిత్ర పటానికి పూల మాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు పల్లె కుమార్ మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో జన్మించిన వాజ్‌పేయి అనేక కష్టనష్టాలు ఎదుర్కొని ప్రధాన మంత్రిస్థాయికి ఎదిగాడని కొనియాడారు. దేశంలో జాతీయ రహదారుల నిర్మాణం, గ్రామీణ సడక్ యోజన లాంటి పథకాలను తీసుకువచ్చిన గొప్పవ్యక్తి అని, ఆయనఆశయ సాధనకు నేటి యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులు కుమార్, రాములు, సురేష్, రాంబాబు, నవీన్, రాజేష్, విజయ్‌కుమార్, సందీప్, రాజు, శ్రీనివాస్, యాకయ్య ఉన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

(5వ పేజీ తరువాయి)

భాస్కర్, మహేందర్, దేవరాజు, రామాచారి, ప్రభాకర్ పాల్గొన్నారు.

● సీరోలు మండంలోని వివిధ గ్రామాల్లో చర్చిల్లో ఫాస్టర్లు క్రిస్మస్ కేక్‌లు కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. ఉప్పరగూడెం ఏసుకృపా మందిరంలో నిర్వహించిన వేడుకల్లో ఫాస్టర్ జాన్‌మార్క్, రూతు ఇవాంజలిస్ట్, షారోన్, శైని పాల్గొన్నారు.

● తొర్రూరు మునిసిపల్ కేంద్రంలోని సీఎస్‌ఐ, సెయింట్ జోసఫ్ కేతడ్రాల్ చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. సీఎస్‌ఐ చర్చిలో జరిగిన వేడుకలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. ఫాదర్ డీకె.నిరీక్షణ్‌రావు దైవసందేశాన్ని వినిపించారు. ఆయా కార్యక్రమాల్లో కృపాల్, ఇందిరా పాల్గొన్నారు.

● తొర్రూరు మండలం మాటేడులో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనమాండ్ల తిరుపతిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చుంచు సంతోష్, నాయకులు సోమ రాజశేఖర్, వల్లపు యాకన్న, నలమాస మహేష్ పాల్గొన్నారు.

● నెల్లికుదురులోని ఇంటిరియర్ బాపిస్టు చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ పాల్గొన్నారు. పాస్టర్ రాజేంద్రకుమార్, అబ్రహం, కాంగ్రెస్ నాయకులు ఎదళ్ల యాదవ రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, నాయిని సత్యపాల్‌రెడ్డి, గొల్లపల్లి ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

● కేసముద్రం స్టేషన్‌లోని షాలేము ప్రార్థనమందిరంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే మురళీనాయక్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, రావుల మురళి, దరావత్ బాలు, పాస్టర్ ప్రభుజీవన్, ఇస్లావత్ రాజు,దివ్య, కేసముద్రం విలేజ్ ఎన్టీఆర్‌నగర్‌లోని అగపేగాస్పెల్ చర్చిలో ఎమ్మెల్యే మురళీనాయక్, పాస్టర్ పిల్లి కుమారస్వామి, అమీనాపురం క్రీస్తు విజయసహవాసం చర్చిలో పాస్టర్ మోజెస్ పాల్గొన్నారు.

● పెద్దవంగర, దంతాలపల్లి, గార్ల మండలాల్లోని ఆయా గ్రామాల చర్చిల్లో పాస్టర్లు కేకులు కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

● కురవి మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని సీఎస్‌ఐ చర్చిలో పాస్టర్ జితేందర్‌జాషువా, మారనాథ చర్చిలో పాస్టర్ ఎల్. విజయ్‌కుమార్, బిలీవర్స్ చర్చిలో పాస్టర్ కృపానందం కేక్‌లు కట్ చేసి క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

ఏజెన్సీలో బోరు బండ్ల ఏజెంట్‌ల దందా

● అటవీశాఖను బూచిగా చూపుతూ వసూళ్లు
● దళారుల దందాతో నష్టపోతున్న రైతన్న
● కొత్తగూడ, గంగారం మండలాల్లో ఏజెంట్ల హవా



కొత్తగూడ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ మండలాల్లో బోరు పేరుతో కొందరు ఏజెంట్లు దందా చేస్తున్నారు. బోరు వేసుకోవాలంటే అటవీశాఖ ఇబ్బందులు ఉంటాయని రైతన్నలను బెదిరిస్తున్నారు.అందినకాడికి దండుకుంటున్నారు. రైతుల సాగునీటి ఆశలను అలుసుగా చేసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ తతంగం కొత్తగూడ, గంగారం మండలాల్లో విచ్చలవిడిగా సాగుతోంది. ఈ రెండు మండలాల్లో రైతులు కేవలం వర్షాధార పంటలనే సాగు చేస్తుంటారు. మరోపంట సాగుచేయాలంటే వ్యవసాయ భూమిలో సాగునీటి కోసం బోరువేసుకోవాల్సిందే.. ఈ రెండు మండలాలు అటవీశాఖ పరిధిలో ఉండటంతో పట్టాలు, హక్కుపత్రాలు ఉన్న భూముల్లో బోరు వేసుకోవచ్చని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే బోరు వేసుకుంటే అటవీశాఖ అధికారులు అడుకుంటారని, గ్రామాల్లో బోరుబండ్ల ఏజెంట్‌లు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. అటవీశాఖ అధికారుల పేరుతో అమాయక రైతుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో రైతన్నలు ఏజెంట్‌లను ఆశ్రయిస్తున్నారు.

బోరు బండ్ల యజమానుల హవా

సాగునీటికి కొరత ఉన్న గిరిజన ప్రాంతాలను, అటవీ ప్రాంతాలను ఆసరాగా చేసుకుని బోరు బండ్లను తీసుకువచ్చి బోరుబండ్ల యజమానులు తమ దందా కొనసాగిస్తారు. గ్రామాలలో ఏజెంట్‌లను ఏర్పరుచుకుని కమీషన్ వారిగా బోర్లను వేయిస్తుంటారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ బోరు వేసుకుంటే పంటలు పండుతాయని ఆశలతో గిరిజన రైతులు బోరు వేసుకుంటారు. బోరు పాయింట్ కోసం జియాలజీ శాఖ వారిని సంప్రదిస్తే వారు భూమి పరిక్షలు చేసి నీరు పడే ప్రాంతాలను గుర్తిస్తారు. కానీ బోరు బండ్ల యజమానులు, ఏజెంట్‌లే బోరు పాయింట్‌లను సూచించి బోరు వేయిస్తున్నారు. అయితే ఆ ప్రదేశంలో నీరు పడకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

దందాలో అటవీశాఖ ప్రమేయమెంత?

బోరుబండ్ల ఏజెంట్ల దందాలో అటవీశాఖ ప్రమేయమెంత అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు రైతన్నలు. కొందరు ఏజెంట్‌లు, దళారులకు అటవీశాఖ క్షేత్రస్థాయి అధికారులతో సంబంధాలు ఉన్నాయని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దందా చేసే ఏజెంట్‌లు నిత్యం అటవీశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని ఆరోపిస్తున్నారు. రైతుల నుంచి వసూలు చేసిన డబ్బులను అటవీశాఖ అధికారులకు కూడా ముడుతాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏజెంట్‌లు, దళారులతో అంటకాగే అటవీశాఖ క్షేత్రస్థాయి అధికారులెవరో అటవీశాఖ ఉన్నతాధికారులు గుర్తించి బోరుబండ్ల ఏజెంట్‌ల అధిక వసూళ్ల నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

అక్రమ వసూళ్లు చేస్తే కఠిన చర్యలు ఎఫ్‌ఆర్వో వజాహత్

అటవీశాఖ పేరు చెప్పి బోరు వేసుకునే రైతుల నుంచి ఏజెంట్‌లు, దళారులు అక్రమ వసూళ్లు చేస్తే చర్యలు తీసుకుంటాం. వారిని గుర్తించి పోలీసు స్టేషన్‌లో కేసులు పెడుతాం. అటవీశాఖ క్షేత్ర స్థాయి అధికారులైన రైతుల నుంచి అక్రమ వసూళ్లు చేస్తే చర్యలు తప్పవు. రైతులు తమ భూమి సంబంధిత పేపర్‌లు ఉంటే బోరు వేసుకోవచ్చు. దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు.

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి

● ఫిర్యాదుదారులకు సత్వరమే న్యాయం చేయాలి ● తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్



పోలీసుల దుస్తులను, పెట్టెలను పరిశీలిస్తున్న డీఎస్పీ క్రిష్ణకిషోర్

పెద్దవంగర, డిసెంబర్ 25 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పరిసరాలను, పలు రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఎస్సై క్రాంతికిరణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ లాఅండ్ ఆర్డర్‌తో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలన్నారు. గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఎవరైనా సరే చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో క్రైంరేటు తగ్గిందని, కేసుల పరిష్కారం వేగవంతంగా పూర్తివుతోందని, ప్రజలు నేర చరిత్రలకు దూరంగా ఉండాలన్నారు. నేరరహిత జిల్లాగా మార్చేందుకు పోలీస్ వ్యవస్థ ఎంతగానో కృషి చేస్తోందన్నారు. ఫిర్యాదుదారులకు సత్వరమే న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని వివరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా గ్రామాల్లో వీపీవోలు గస్తీ నిర్వహించాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు, అక్రమ వ్యాపారాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఎవరైనా అనుమానితులు, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌కు, డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు. నేర ప్రవర్తన కలిగిన వ్యక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ, సౌకర్యాల తీరుపట్ల ఎస్సై క్రాంతికిరణ్‌ను అభినందించారు. తొర్రూరు సీఐ కె.జగదీష్, ఎస్సై విజయరాజు, పోలీసు సిబ్బంది ఉన్నారు.



శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

అయ్యప్పస్వామి దేవాలయంలో లక్ష పుష్పార్చన

మహబూబాబాద్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీఅయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయంలో ధ్వజరోహణ మహోత్సవం, మండల పూజను ముగింపును పురస్కరించుకుని ఆరు రోజుల పాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఈనెల 21 నుంచి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. బుధవారం ఐదోరోజు ఉదయం 4:30 గంటల నుంచి శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు కేశవన్ నంబూద్రి, మాధవన్ నంబూద్రి మంత్రోచ్చరణల నడుమ పూజలు జరిగాయి. అనంతరం ఉదయం 9 గంటలకు అయ్యప్ప స్వాములచే లక్ష పుష్పార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పస్వాములు గద్దె రవి, ఎడ్ల రమేష్, నాళ్ల లక్ష్మీనర్సింహారావు, రాంచంద్రయ్య, శ్రీనివాస్, కౌన్సిలర్లు పోతు రాజు రాజు, ఎడ్ల వేణుమాధవ్, బోనగిరి గిరిధర్ గుప్తా పాల్గొన్నారు.

ఇనుగుర్తిలో 30 పడకల ఆస్పత్రి కోసం కృషి

● ఎమ్మెల్యే మురళీనాయక్

ఇనుగుర్తి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి మంజూరు కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే మురళీనాయక్ హామీ ఇచ్చారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మండలానికి కేటాయించిన 108 అంబులెన్స్‌ను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ ఆరోగ్య సేవలు అందించడంలో సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక దృష్టి ఉందని తెలిపారు. 108 వాహనంతో మండలం ప్రజలకు అత్యవసర వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్, బైరు అశోక్‌గౌడ్, గంజి రాజేందర్‌రెడ్డి, కొట్టం మహేందర్‌రెడ్డి, చిన్నాల కట్టయ్య, మలిశెట్టి శ్యాం, కుంచాల రమేష్, మామిడి జనార్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్, చందు, మురళీ, వెంకన్న పాల్గొన్నారు.



ఇనుగుర్తిలో అంబులెన్స్ ప్రారంభిస్తున్న మురళీనాయక్

'ఎన్డీ విలీన సభను జయప్రదం చేయండి'



భట్టు అంజయ్య స్మారక భవనంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎన్డీ నేతలు

మహబూబాబాద్‌రూరల్, డిసెంబరు25 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఈనెల 28న సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రెండు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మండల వెంకన్న, జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని భట్టు అంజయ్య స్మారకభవనంలో బుధవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 2013లో వివిధ కారణాల రీత్యా విడిపోయిన ఆ రెండు పార్టీ నేడు విలీనం కావడం శుభపరిణామమన్నారు. దేశంలో మతోన్మాద బీజేపీ మోదీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలతో ప్రజలను అరిగోస పెడుతున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో ఈనెల 28న జరిగే సభకు రెండు వర్గాల సంబంధించిన పార్టీల కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు. బండారి ఐలయ్య, హలావత్ లింగన్న, నందగిరి వెంకటేశ్వర్లు, గుజ్జు దేవేందర్, సామ పాపయ్య, భట్టు చైతన్య, బోనగిరి మధు, లక్ష్మయ్య, పర్వత కోటేష్, జబ్బార్, కృష్ణ, మురళి, సురేష్ పాల్గొన్నారు.

బోగస్ సర్టిఫికెట్లపై విచారణ జరపాలి

టీపీటీఎఫ్ మండల నాయకులు

కేసముద్రం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖలో వివిధ ప్రాంతాల్లో బోగస్ సర్టిఫికెట్లతో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గుండు సురేందర్, ప్రధాన కార్యదర్శి నర్సింహరాజు డిమాండ్ చేశారు. కేసముద్రంలో బుధవారం వారు మాట్లాడుతూ నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు, పదోన్నతులు పొందుతూ అర్హులైన ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తున్నవారిపై చట్టపరంగా కఠినంగా వ్యవహరించాలని కోరారు.

మను ధర్మశాస్త్ర ప్రతుల దహనం



మనుధర్మ శాస్త్ర ప్రతులను దహనం చేస్తున్న జేఎంఎం నేతలు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని భీమ్‌రావ్‌నగర్‌లో జాతీయ మాల మహానాడు (జేఎంఎం) రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం మనుధర్మశాస్త్ర ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.నిచ్చెన మెట్ల కులవ్యవస్థను తీసుకువచ్చి కులాల ఆధారంగా వృత్తులను విభజించిన మను ధర్మశాస్త్రం అనేది దేశానికి పట్టిన విద్వేషమని, మనుస్మృతి ఆధారంగా నాడు శిక్షలు ఉండేవని, పరిపాలన సాగేదని చెప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 25 డిసెంబర్ 1927న మను ధర్మశాస్త్ర ప్రతులను చించి, తగలబెట్టి అగ్నిలో కాల్చి వేశారని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని మార్చి మనువాదాన్ని మళ్లీ తెర మీదకు తెచ్చే కుట్రలు పాలకులు చేస్తున్నారని ఆ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. దార సాత్విక్, గుర్రం శరత్, పిల్లి సాయి, రంజిత్, ఉదయ్ పాల్గొన్నారు.


ఆశ్రమంలో దుప్పట్లు పంపిణీ

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రెడ్యాల శివారు సికింద్రాబాద్ తండాలోని దైవకృప వృద్ధాశ్రమంలో ప్రముఖ వ్యాపార వేత్త రతన్‌టాటా జయంతిని పురస్కరించుకుని టాటా ఏఐఏ ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టాటా ఏఐఏ భద్రాద్రి కొత్తగూడెం బ్రాంచ్ మేనేజర్ జక్కుల సతీష్ మాట్లాడుతూ... రతన్‌టాటా జీవితం సమాజానికి మార్గదర్శనీయమని చెప్పారు. వ్యాపార దిగ్గజం రతన్‌టాటా తనకు వచ్చిన ఆదాయంలో అధిక శాతం ప్రజాసేవకు ఖర్చు చేసే వారని చెప్పారు. ప్రార్థించే పెదాల కన్నా సహాయం చేసే చేతులే మిన్నా అన్న మాతృమూర్తి మదర్‌థెరిస్సా సూక్తిని పాటించే వారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దైవకృప వృద్ధ ఆశ్రమ నిర్వహకులు బానోత్ లోకేష్, వీరన్న, వెంకన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వరి కొయ్యలను రైతులు కాల్చొద్దు

దంతాలపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరి కొయ్యలను రైతులు కాల్చొద్దని వ్యవసాయాధికారి వాహిని అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ వరి కొయ్యలను కాలబెట్టడం ద్వారా సారవంతమైన నేల నిస్సారవంతంగా అవుతుందన్నారు. భూమిలో సహజ సిద్ధంగా ఉండే నత్రజని, భాస్వరం వంటి విలువైన పోషకాలు కోల్పోతామన్నారు. ఇప్పటికైనా రైతులు వరి కొయ్యలను కాలబెట్టడం చేయొద్ద న్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు దీక్షిత్, ఉదయ్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీలకు పవన్, బాలాజీ



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పంజాబ్ రాష్ట్రంలోని సంగునూరులో ఈనెల 26 నుంచి జనవరి 3 వరకు జరిగే జాతీయస్థాయి సీనియర్ బేస్‌బాల్ పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పుప్పాల సంజీవ బుధవారం తెలిపారు. మహబూబాబాద్‌లో ఈనెల 13 నుంచి 15 వరకు జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన కేసముద్రం కల్వల మోడల్ స్కూల్ విద్యార్థి బాలాజీ, కురవి మండలం నేరడ మోడల్ స్కూల్ విద్యార్థి పవన్‌ను అసోసియేషన్ బాధ్యులు పద్మావతి, ఆవారి శ్రీను అభినందించారు.

శభాష్ కొమ్మాలు..

● మంకీబోన్‌తో కోతుల బెడదకు చెక్ పెట్టిన ఓ యువనేత
● రూ.10 లక్షలు వెచ్చించి.. 2వేల వానరాల పట్టివేత



గూడూరులోని మంకీబోన్‌లో ఉన్న కోతులు

గూడూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఊళ్లలో కోతుల బెడద ఎక్కువైంది. ఇటీవల కాలంలో పంటలను నాశనం చేయడంతోపాటు ఇళ్లను పీకి పందిరేస్తున్నాయి. తమ చేష్టలతో జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. ఈ క్రమంలోనే గూడూరులో ప్రజలు ఎదుర్కొంటున్న కోతుల బెడదను నివారించేందుకు ఓ యువ నాయకుడు రంగంలోకి దిగాడు. యూ ట్యూబ్‌లోని పలు వీడియోలను చూసి.. పరిష్కారం చూపాడు. ఆయనే వాంకుడోతు కొమ్మాలు. మహబూబాబాద్ జిల్లాలోని చిన్న పట్టణమైన గూడూరు చుట్టూ వ్యవసాయ భూములు విస్తరించి ఉన్నాయి. ఇక్కడి రైతులు వరితో పాటు మొక్కజొన్న, వేరుశనగ, ఆపరాల పంటలు సాగు చేస్తుంటారు. కొద్ది కాలంగా గూడూరు ప్రాంతంలో కోతులు మందలు మందలుగా సంచరిస్తూ.. పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఈ క్రమంలో రైతులు ఎన్నిచర్యలు వానరాలను నియంత్రించడం సాధ్యం కాలేదు. ఈ క్రమంలో కొమ్మాలు కోతుల బెడద నివారణకు యూట్యూబ్‌లో వీడియోలు చూసి.. మంకీబోన్ సరైన పరిష్కారమని నిర్ణయానికి వచ్చాడు. గూడూరులోని వెల్డింగ్ వర్కర్స్‌తో ఒక్కో బోన్‌కు రూ.50 వేల చొప్పున వెచ్చించి నాలుగు మంకీబోన్‌లను తయారు చేయించాడు. ఆ తర్వాత మంకీ క్యాచర్ టీం సభ్యులను రప్పించి.. ఒక్కో కోతికి రూ.300 చొప్పున ఇస్తానని ప్రకటించాడు. ఆతర్వాత మంకీ క్యాచర్ బృందం కొమ్మాలు తయారు చేయించిన మంకీబోన్ ద్వారా కోతులను పట్టింది. ఇలా నాలుగు వారాల్లో సుమారు 2వేల కోతులను పట్టి..వాటిని సురక్షితంగా భద్రాచలం ప్రాంతంలోని దట్టమైన అటవీప్రాంతాల్లో విడిచిపెట్టారు. మొత్తంగా ఈ ప్రక్రియకు కొమ్మాలుకు రూ.10లక్షల వరకు ఖర్చవగా.. అదంతా సొంతంగా పెట్టుకున్నారు. దీంతో తమ సమస్య పరిష్కారమైందని, కోతుల నుంచి కాపాడిన కొమ్మాలును గూడూరు వాసులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల రైతులు అభినందిస్తున్నారు.



తరలించేందుకు సిద్ధంగా ఉన్న కోతులను చూపిస్తున్న యువనేత కొమ్మాలు

ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

తహసీల్దార్ సైదులు, ఎస్సై సతీశ్



మరిపెడ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆకేరు, పాలేరు నదుల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని మరిపెడ తహసీల్దార్ సైదులు, ఎస్సై సతీశ్ హెచ్చరించారు. బుధవారం మరిపెడ విశ్రాంతి భవన్‌లో వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కొంత మంది దళారులు నిత్యం ఏలాంటి పర్మిట్లు లేకుండా ఆకేరు, పాలేరు నదుల నుంచి ఇసుకను రాత్రింబవళ్లు రవాణా చేస్తున్నారని, అట్లాంటి వాళ్ల ఆటలు ఇక సాగవన్నారు. మొదటిసారి బైండోవర్ చేశాక, మళ్లీ అక్రమంగా ఇసుక రవాణా చేసి దొరికితే ఇక అంతే సంగతులన్నారు. అదే విధంగా బెల్లం, బియ్యం దందా చేసేటోళ్లను సైతం వదలమని ఎస్సై గుర్తు చేశారు. ఈ సమావేశంలో నర్సింహులపేట తహసీల్దార్ నాగరాజు తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : ఎంపీవో

దంతాలపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులు రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షం పట్ల సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీవో మహ్మద్ అప్సర్‌పాష సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని వార్డులో మార్పులు, చేర్పులకై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రజలు తమ ఓటుహక్కు లిస్టును చూసుకోవాలని సూచించారు. కార్యదర్శులు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి కనీస సౌకర్యాలను గుర్తించాలన్నారు.

'రుణాలను మాఫీ చేయాలి'

దంతాలపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన రూ.2 లక్షల పైబడి ఉన్న రుణ మాఫీని అమలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం వారు మండల కేంద్రంలో విలేకరులతో రైతులు భద్రూనాయక్, పోట్యానాయక్, వెంకటేష్, సంజీవరెడ్డి, శ్రీనువాస్ మాట్లాడారు. నేడు రూ.2లక్షలు మాత్రమే మాఫీ చేస్తిమని అని ప్రభుత్వం పేర్కొనడం సరికాదన్నారు. రైతుల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల డిసెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మండలంలో పలు అభి వృద్ధి పనులను బుధవారం ఆమె ప్రారంభించారు. మండలకేంద్రంలో సెంట్రల్ లైటింగ్, నర్సింగాపురంలో బయ్యన్న రిజర్వాయర్ అనకట్టపనులు, చెక్‌డ్యాం నిర్మాణపనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ గ్రామీణ ప్రాంతాల్లో కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డి.సురేష్‌నాయక్, జిల్లా కార్యదర్శి ధర్మారం భిక్షపతి, డి.రాజేష్ నాయక్, కొడకండ్ల పట్టణ అధ్యక్షుడు మసురం రవీందర్, ఏఎంసీ డైరెక్టర్ వల భోజు రమేశ్, పనస శ్రీనివాస్, బత్తుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో సత్యనారాయణ వ్రతం

పాలకుర్తి : నియోజకవర్గ ప్రజలు పాడి పంటలతో, సుఖ సంతోషాలతో సుభి క్షంగా జీవించాలని సత్యనారాయణ వ్రతం నిర్వహించినట్లు ఎమ్మెల్యే మామి డాల యశస్విని రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాపు కార్యాలయంలో యశస్వినిరెడ్డి, రాజారామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి అనుమాండ్ల ఝాన్సీరెడ్డి దంపతులు, డాక్టర్ రాజేందర్‌రెడ్డిల దంప తులు వేద మంత్రోచ్చరణల మధ్య సత్యనారాయణ వ్రతం నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం రమా సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బ్లాక్ అధ్యక్షుడు రాసాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, మార్కెట్ చైర్ పర్సన్ లావుడ్యా మంజుల, వైస్ చైర్మన్ అనుముల మల్లారెడ్డి, భాస్కర్, ఎర్ర బెల్లి రాఘవరావు తదితరులు ఉన్నారు.



నర్సింగాపురంలో చెక్‌డ్యామ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న యశస్వినిరెడ్డి